4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 8 మార్చి 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అమెరికా బరిలో ఆ ఇద్దరు

**అమెరికా** అధ్యక్ష ఎన్నికల తంతులో మహా మంగళవారం (సూపర్ ట్యూజ్‌డే) ముగిసింది. పోయినసారి తలపడిన ఇద్దరు ప్రత్యర్థులు జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీల అభ్యర్థులుగా బరిలో మిగిలారు. ప్రధాన అభ్యర్థులు ఆ ఇద్దరే అయినా సిట్టింగ్ ప్రెసిడెంట్ తారుమారు కావడం విశేషం. డెమొక్రాటిక్ అభ్యర్థిత్వానికి పెద్దగా పోటీ లేకపోయినా రిపబ్లికన్ టికెట్ కోసం పలువురు తలపడ్డారు. వారిలో భారత సంతతికి చెందిన ఇద్దరు ప్రముఖులు ఉండటం గమనార్హం. వ్యాపారవేత్త అయిన వివేక్ రామస్వామి ముందే తప్పుకోగా, సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన నిక్కీ హేలీ సూపర్ ట్యూజ్‌డేకు ఒకరోజు ముందుగానే పోటీ నుంచి నిష్క్రమించారు. భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ ప్రస్తుతం దేశ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. బైడెన్ బహుశా ఈ సారి కూడా ఆమెనే ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకునే అవకాశాలున్నాయి. అమెరికా అత్యున్నత అధికార పీఠాలకు జరిగే ఎన్నికల్లో పెరుగుతున్న భారత సంతతి నేతల ప్రాబల్యానికి ఇది అద్దం పడుతున్నది.

ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేతల్లో అత్యధికులు ట్రంప్‌కు మద్దతు తెలుపుతున్న సంగతి తెలిసిందే. కానీ చివరిదాకా అభ్యర్థిత్వం కోసం పోటీపడి చివరి నిమిషంలో వైదొలిగిన నిక్కీ హేలీ మాత్రం ట్రంప్‌ను బలపరచకపోవడం గమనార్హం. ఇద్దరు అభ్యర్థులూ ఎనభయ్యోవడికి అటు ఇటుగా ఉన్న ముదివగ్గులే. ఇద్దరి జ్ఞాపకశక్తి, నిర్ణయశక్తి మీద సందేహాలున్నాయి. వారి పాపులర్ రేటింగ్స్ కూడా తక్కువగానే ఉన్నాయి. యువశక్తికి అవకాశాలెప్పుడు అనే ప్రశ్నలు ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి. మరోవైపు అమెరికా అగ్రపీఠంపై ఓ మహిళ కూర్చునేది ఎప్పుడనే ప్రశ్న ఎప్పటినుంచో వేలాడుతూనే ఉన్నది. పోయినసారి జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్, ట్రంప్ హోరాహోరీగా తలపడ్డారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫలితాల లెక్కింపులో బైడెన్ విజేతగా తేలడం, ట్రంప్ ఓటమిని అంగీకరించకుండా నానా యాగీ చేయడం అమెరికా చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఘట్టంగా నిలిచింది. ట్రంప్ మద్దతుదారులు కాంగ్రెస్ భవనం మీద దాడికి తెగబడటం ఈ ధోరణికి పరాకాష్ఠ. ఈ వ్యవహారంపై రకరకాల విచారణలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించిన ట్రంప్ ఎన్నికల్లో పోటీ చేయరాదంటూ కొలరాడో అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పి సంచలనం కలిగించింది. అయితే చివరికి సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేయడంతో ఆయనకు దారులు సుగమమయ్యాయి. తీవ్ర జాతీయవాదిగా పేరుపడిన ట్రంప్ తన హయాంలో అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా అమెరికాకు వలస వచ్చేవారికి ఇచ్చే వీసాలపై ఆయన పలు నియంత్రణలు ప్రవేశపెట్టారు. ఒక వర్గం వారికి ప్రవేశం లేదంటూ ఆయన జారీచేసిన ఫర్మానా తీవ్ర విమర్శలకు గురైంది. మెక్సికో నుంచి అక్రమంగా అమెరికాలోకి వచ్చేవారిని అడ్డుకునేందుకు సరిహద్దుల్లో గోడ లాంటి కంచె కట్టారు. ప్రపంచవ్యాప్తంగా అతివాద నాయకత్వాలు అధికారంలోకి వస్తున్న ధోరణికి ట్రంప్ పాలన ఓ సూచికగా నిలిచింది. మరోవైపు బైడెన్ సామరస్య వాదిగా ముందుకువచ్చి ట్రంప్ రెండో విడత గెలవకుండా అడ్డుకట్ట వేశారు. ఇప్పుడు రెండోసారి ఆ ఇద్దరే చివరికి పోటీలో మిగలడం అమెరికా రాజకీయ వైచిత్రి.

# చూపు మారితేనే మహిళా వికాసం

నేడు ప్రపంచ మహిళా దినోత్సవం. విజ్ఞులైన పాఠక మహాశయులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ఏటా మార్చి 8వ తేదీని ప్రపంచ మహిళా దినోత్సవంగా వేడుక చేసుకుంటున్నాం. ఇది మహిళా దినోత్సవమే అయినా మహిళలకు మాత్రమే సంబంధించిన విషయం కాదు, సమాజం మొత్తానికి సంబంధించిన విషయం. మహిళ అంటే గౌరవం, అభిమానం ఉన్నవారందరూ జరుపుకొనే పండుగ.

> అంటే ఉపన్యాసాలు చెప్పి ముగించటం కాదు, మహిళలు సాధించిన విజయాలను సగర్వంగా చాటిచెప్తూ, వారి అవసరాలను అర్థం చేసుకోవటానికి, వారికి ఉన్న సమస్యలను తీర్చటానికి, వారి అభ్యున్నతికి పాటుపడటానికి సభ్య సమాజం, ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యల పట్ల అందరిలో అవగాహన కల్పించటం ఈ ఉత్సవ ముఖ్య ఉద్దేశం. ఇది ఒక రిచ్యువల్‌గా జరుపుకొనే వేడుక కాదు. మహిళల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు అవసరాల పట్ల సహృదయమైన అవగాహనను సమాజంలో పెంపొందించేందుకు ఈ వేడుక ఒక వేదిక కావాలి. మహిళల సమస్యలు మగవారికి అంత సులభంగా అర్థం కావు. వారి సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకోవటానికి ఒక మంచి వాతావరణం ఏర్పడాలి.



గుమ్మడిదల రంగారావు

## నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఏ సమాజం, ఏ సంస్కృతి ఏ జాతి స్త్రీకి సమున్నత స్థానం కల్పిస్తుందో ఆ సమాజం, ఆ సంస్కృతి ఆ జాతి అభివృద్ధి పథంలో ముందుంటుంది. ఏ సమాజం, ఏ సంస్కృతి ఏ జాతి అయితే ఈ విషయంలో వెనుకడుగు వేస్తుందో ఆ జాతి అభివృద్ధిని సాధించలేక ప్రగతిపథంలో వెనుకబడే ఉంటుంది. పాశ్చాత్య దేశాలు నేడు ఒళ్లు గగుర్పొడిచే ప్రగతిని సాధించాయంటే దానికి కారణం వారు జీవన స్రవంతిలో అన్నిరంగాల్లో స్త్రీకి ఇచ్చిన సమున్నత స్థానమే అనటంలో ఎటువంటి సందేహం లేదు. ఏ దేశంలోనైనా జనాభాలో సగభాగమైన స్త్రీలు వారిలోని ఉత్పాదక శక్తిని వినియోగించే అవకాశం ఉంటేనే కదా సమాజం అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధించి ముందుకువెళ్తుంది. అలాంటి వాతావరణం కలగచేయవలసిన బాధ్యత సమాజం మీద ప్రభుత్వాల మీద ఉంటుంది. ఆ బాధ్యతను ఏడాదికి ఒకసారైనా గుర్తుచేసుకోవటం సముచితం. ఈ విషయంలో మనం ఆలస్యంగా మేలుకున్నాం.

సమాజంలో స్త్రీ వివక్షకు గురైందన్న విషయంలో ఎవరికీ సందేహం ఉండనవసరం లేదు. నేడు స్త్రీ అన్నిరంగాల్లో పురుషులకన్నా మిన్నగా రాణిస్తున్నప్పటికీ స్త్రీ పట్ల చులకనభావం నుంచి సమాజం బయటపడలేదని చెప్పాలి. మార్పు రావాలంటే వాస్తవాన్ని ఒప్పుకోవాలి. స్త్రీని జెండర్ కోణంలో కాకుండా ఒక మనిషిగా చూడటం సమాజం నేర్చుకోవాలి. స్త్రీ రూపాన్ని కాకుండా స్వరూపాన్ని చూసే దిశగా సమాజం పయనించాలి. అందంగా ఉంటే అదే పనిగా చూడాలా? అందంగా లేకపోతే పెదవి విరవాలా? పిల్లలకు పాఠశాల దశ నుంచే స్త్రీ పట్ల చైతన్యవంతమైన దృక్పథం అలవడేలా అడుగులు వేయాలి. పాఠ్య పుస్తకాల్లో కూడా స్త్రీ సంబంధిత అంశాలను చేర్చాలి. చిన్నారుల మనసులను పసితనం నుంచే స్ఫూర్తిదాయకంగా మార్చాలి. అప్పుడే లైంగిక వేధింపులకు అడ్డుకట్ట పడుతుంది. కానీ, ఇది ఒక్క రోజులో అయ్యే పని కాదు. దృక్పథంలో మార్పు అనేది నిరంతరం జరగాల్సిన ప్రక్రియ. స్త్రీల మీద జరిగే దాడుల విషయంలో సత్వర న్యాయం జరగాలి.

ఆధునిక స్త్రీ అన్నిరంగాల్లో పురుషుల కన్నా మించి రాణిస్తుందనటంలో సందేహం లేదు. ఉదాహరణకు ఒకే సంస్థలో ఉద్యోగం చేసే ఒక మగవాడు, ఒక మహిళను తీసుకుందాం. మగవాడు ఇంటి దగ్గరి నుంచి వచ్చింది మొదలు ఇంటికి వెళ్లే వరకూ తన పని తాను చేసుకుంటూ వెళ్తాడనుకుందాం. అది నిజమే కదా. అయితే స్త్రీ తన విధులు పురుషులతో సమానంగా నిర్వర్తించటంతోపాటుగా, ఇంటిని గురించి ఆలోచిస్తుంటుందన్న విషయాన్ని కాదనగలమా? పసి పిల్లలుంటే, వాళ్లు ఎలా ఉన్నారోనని, బడికిపోయే పిల్లలుంటే వాళ్లు బడి నుంచి వచ్చాక తిన్నారో లేదోనని ఆలోచిస్తుంది స్త్రీ. పిల్లలున్న పురుషుడికి ఈ ఆలోచనలు ఉండవు. ఎందుకని? పురుషుడికి బాధ్యత లేదు అని కాదు ఇక్కడ వాదన. ఇంటి వ్యవహారం అంతా స్త్రీ చూసుకుంటుందని భరోసా! ఈ పరిస్థితిలో ఎవరు ఎక్కువ పని చేస్తున్నట్టు? స్త్రీ ప్రకృతిపరంగా తనకుండే ఇబ్బందులను అధిగమించి పనిచేయాలి. పురుషులకు ప్రకృతిపరమైన ఇబ్బందులేమీ లేవు.

స్త్రీలు పని ప్రదేశంలో ఇంటిని గురించి ఆలోచించేది పనికిందికి రాదనే వితండవాదులూ ఉన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే కదా అంటారు. మరి పని ప్రదేశంలో ఉండి అక్కడ బాధ్యతలను పురుషులతో సమానంగా నిర్వర్తిస్తూ కూడా రేపటి పౌరులను, అంటే తన పిల్లలను, గురించి ఆలోచించటమంటే అది సమాజ సేవ కాదా? అది దేశ సేవ కిందికి రాదా? ఆ పిల్లలే కదా రేపు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలయ్యేది? చంద్రయాన్ విజయవంతమైనప్పుడు మన ప్రధాని శ్రీహరికోట వెళ్లి అక్కడి శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించినప్పుడు ఆ బృందంలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలను మనమందరం చూశాం. వాళ్లు కూడా వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూనే ఇంట్లో పసి పిల్లలు ఎట్లా ఉన్నారోనని ఆందోళన చెందిన సందర్భాలు సమాజానికి కనిపించవా? ఇంటిని చూసుకుంటూనే శాస్త్రవేత్తలుగా వారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించటం గొప్ప విషయం కాదా? ఒక్క ఇస్రోలోనే కాదు, ఏ పని ప్రదేశంలోనైనా ఇదే జరుగుతుంది. దీనికి వెల కట్టగలమా?

మహిళల సమస్యలను పురుషులు కొంతవరకే అర్థం చేసుకోగలరు. ప్రకృతిపరంగా స్త్రీకి ఉన్న సమస్యలు స్త్రీలకు మాత్రమే అర్థమవుతాయి. మరి ఆ సమస్యల పరిష్కారానికి చేసే విధాన రూపకల్పన ప్రక్రియలో స్త్రీలకు స్థానం ఉండాలా లేదా? దీన్నే ప్రజా జీవితంలో స్త్రీకి సమున్నత ప్రాతినిధ్యం ఇవ్వటం అంటారు రాజకీయ భాషలో. అంటే పరిపాలనకు రూపకల్పన చేసే చట్టసభల్లో స్త్రీలకు జనాభాలో వారి నిష్పత్తికి తగిన ప్రాతినిధ్యం లేదు.

> చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కావాలని ఎన్నో ఏండ్ల నుంచి గొంతెత్తి ఘోషిస్తుంది మహిళా లోకం. నేటికి పాలకులు కరుణించి ఐదేండ్ల తర్వాత మూడో వంతు ప్రాతినిధ్యం కల్పిస్తాం అని సెలవిచ్చారు. కానీ ఐదేండ్లు ఎందుకు ఆగాలనే దానికి ఎవరివద్దా సమాధానం లేదు.

ఈ మధ్యకాలంలో పరిపాలనా వ్యవస్థలో ఒక హర్షించదగిన మార్పు చూస్తున్నాం. అదేమంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఎక్కువగా స్త్రీల పేరు మీద ఇస్తున్నారు. ఇదొక శుభ పరిణామంగానే చూడాలి. డ్వాక్రా ఉద్యమం కారణంగా బ్యాంకులు మహిళా స్వయం సహాయక సంఘాలకు పూచీకత్తు లేని రుణాలను విరివిగా ఇస్తున్నాయి. నేడు స్త్రీలు ఆత్మ విశ్వాసంతో బ్యాంకు మెట్లు ఎక్కుతున్నారు. బ్యాంకు అధికారులతో ధైర్యంగా మాట్లాడగలుగుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారం గణనీయంగా తగ్గిపోయింది. స్త్రీ మొహంలో చిరునవ్వు ఉంటే తన ఇంట్లో సంతోషం ఉన్నట్టు. స్త్రీ ఆరోగ్యంగా ఉంటే తన ఇల్లు ఆరోగ్యంగా ఉన్నట్టు. స్త్రీ చేతిలో ధనం ఉంటే ఆ ఇంట్లో ధనం ఉన్నట్టు. స్త్రీ చేతిలో ఉండేది ఏదైనా కుటుంబంలోని ప్రతి మనిషికీ అందుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. మధ్య తరగతి ఇండ్లలో చాకిరిచేసే స్త్రీకి ఆ ఇళ్లవారు తినమని ఏమైనా ఇస్తే ముందు పిల్లలకు, ఆ తర్వాత పెనిమిటికి పెట్టగా మిగిలితేనే తాను నోట్లో వేసుకుంటుంది గాని, తానే ముందు తినదు, ఆమె ఎంత ఆకలి మీద ఉన్నప్పటికీ! అది స్త్రీకి సహజంగా అబ్బే త్యాగనిరతి.

అంతటి బాధ్యతాస్ఫూర్తి, త్యాగనిరతి ఉన్న వ్యక్తి విధానరూపకల్పన ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వామి అయి ఉండాలి. ఇది సమాజానికి శ్రేయస్కరం. ఆ దిశగా స్త్రీలు పయనించటానికి విధానరూపకల్పనలో భాగస్వామ్యం పొందటానికి కుటుంబపరంగా, సమాజపరంగా అనువైన వాతావరణం కల్పించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదన్న విషయాన్ని ఈ రోజు మనం అర్థం చేసుకుంటే మహిళా దినోత్సవ వేడుక పరిపూర్ణమైనట్టే.



# ఉత్సవం.. ఓ సమీక్షా సందర్భం

> మార్చి 8వ తేదీని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా ప్రతిపాదించిన అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమ నాయకురాలు క్లారా జెట్కిన్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. క్లారా ఆఖరి సందేశాన్ని నెరవేర్చాల్సిన కర్తవ్యం ప్రతి ఆధునిక మహిళపై ఉన్నది.

నేటి ప్రభుత్వాలు, ఎన్జీవో సంఘాలు మార్చి 8వ తేదీని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా వేడుక చేసుకుంటున్నాయి. నిజమైన ఆనందం విజయంలోనే ఉంటుంది వాస్తవమే కానీ, రమిజాబి, సంగీత శర్మ, ప్రతిమ, శ్రీలక్ష్మీ నుంచి మొదలు ఎందరో అభయలు, నిర్భయలు, శుశృత, రవళి ఇటీవలి భవ్య, వైష్ణవిల ఉదంతాలు నేటికీ జరుగుతున్నాయి. ప్రేమించకపోతే యాసిడ్, పెట్రోల్ దాడుల వంటివి మన దృష్టికి వచ్చినవి కొన్ని మాత్రమే. దృష్టికి రానివి ఎన్ని కేసులో!

రోజురోజుకు స్త్రీల మీద హింస పెరుగుతున్నదనే మాట వాస్తవం కాదా? ఎందరో స్త్రీలు చనిపోతున్నారు, కొందరు చనిపోతామని భయంతో బతుకుతున్నారు. అనేక మంది మహిళలు మానసిక జబ్బులకు గురవుతున్నారు. పైకి కనిపించే కారణాలేవైనా హింస మాత్రం వీటన్నింటినీ ఆవరించి ఉన్న తరుణంలో మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా ఉత్సవం చేసుకోవడం అర్థం లేని పనే. ఉత్సవాలు మహిళలుగా మన లక్ష్యాన్ని నిర్వచించుకునే వేళలుగా, మన పురోగతిని సమీక్షించుకునే సందర్భాలుగా మారాలి కానీ, వంటల పోటీలు, ప్యాషన్ షోలతో, ఎంజాయ్ చేసే సందర్భాలుగా కాకూడదు.

ప్రధానంగా స్త్రీలపై హింస నాలుగు రకాలుగా జరుగుతున్నది. కుటుంబ హింస, లైంగిక హింస, రాజకీయ హింస, రాజ్యహింస. ఇది నాలుగు గోడల మధ్యన, సమాజంలో, కమ్యూనిటీలో, రాజ్య యంత్రాంగంలోనూ జరుగుతున్నది. స్త్రీలు శిశువులుగా, పిండాలుగా ఉన్నప్పుడే హత్య చేయబడుతున్నారు. ఇంకా అనేక లైంగిక వేధింపులకు గురవుతున్నారు. పురుషుడితో మహిళకు ఉన్న సంబంధం వల్ల కుటుంబ హింసకు, వరకట్న మరణాలకు గురవుతున్నారు. అంతేకాకుండా సాయుధ ఘర్షణలు జరిగిన సందర్భాల్లో మహిళపై అత్యాచారాలు జరుగుతున్నాయి. స్త్రీలను బలత్కారం చేయడం ద్వారా ఒక కమ్యూనిటీని మొత్తంగా అవమానించవచ్చునేది దీని వెనుకున్న ధోరణి అనుకుంటున్నది. ఇక్కడ ప్రధానంగా రాజ్య స్వభావాన్ని, కుట్రలను పసి గట్టాల్సిన అవసరం ఉన్నది. దేశవ్యాప్తంగా విధ్వంసకర అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులవుతున్న ప్రజలు ముఖ్యంగా ఆదివాసీ ప్రజలు పోరాడుతున్నారు. వారిపై రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. పాలకుల విధానాలను ప్రశ్నిస్తున్న, ఎదిరిస్తున్న ప్రజలపై, ముఖ్యంగా స్త్రీలపై అత్యాచారాలనే అయుధంగా రాజ్యం ఎంచుకున్నది. కశ్మీర్, ఈశాన్య రాష్ర్టాలు, మధ్య భారతంలో అదే దండకారణ్యంలో మహిళల మాన ప్రాణాలను తోడేస్తున్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం కోసం దశాబ్దాలుగా పోరాడినా ఆఖరికి ఎన్నో మెలికలతో అది ఆమోదం పొందింది. అయినప్పటికీ 2029 వరకు అది అమల్లోకి వచ్చే అవకాశం లేదు. అంటే భారతదేశంలో ఉన్న పార్లమెంటరీ రాజకీయ పార్టీలన్నీ పురుషాధిపత్యం కలిగి ఉన్నాయనే అర్థం చేసుకోవాలి. ఆడపిల్లలు స్వేచ్ఛగా సంచరించేందుకు అవసరమైన భద్రతా వాతావరణాన్ని కల్పించాలని పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా సాధికారత, మహిళా స్వాతం త్ర్యం అంటూ ఆకర్షణీయమైన మాటలను వల్లిస్తున్న పాలకు లు మరొకవైపు మహిళల పట్ల, సమాజ దృక్పథం కించిత్ కూ డా మారకుండా ఉండేందుకు తగిన భావజాలాన్ని పెంచిపోషిస్తున్నారు. గ్రామాల్లోనే కాదు, పట్టణాల్లోనూ మహిళలు పలురకాలుగా హింసలకు గురవుతున్నారు. వీటిని నిరోధించేందు కు శాస్త్రీయంగా ఆలోచించి కార్యాచరణకు దిగాలి.

ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా, శారీరకంగా మహిళలను సర్వనాశనం చేస్తున్నారు. భూ స్వామ్య, రాజరిక భావజాలపు అవశేషాలను అట్లాగే కొనసాగిస్తూ మహిళలను సేవకులుగా, ఆధునిక బానిసలుగా, పని మనుషులుగా, భర్తల కోరికలు తీర్చే భామలుగా, పిల్లలను కనే యంత్రాలుగా, ఆస్తిపాస్తులపై హక్కులు లేకుండా, తిట్టినా, కొట్టినా అణగిమణగి ఉండే స్థితిని కొనసాగిస్తూనే మరోవైపు కల్లబొల్లి మాటలతో, పంచరంగుల ప్రచారాలతో మహిళల సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు ప్రచార ఆర్భాటాలను కొనసాగిస్తున్నారు. కాబట్టి మహిళా సమస్యల పరిష్కారానికి సమాజంలో మౌలిక మార్పులు జరగాలి. మహిళల మీద అమలవుతున్న సమస్త పీడనలకు మూలాలు, దోపిడీ సమాజంలోనే ఉన్నాయి. కాబట్టి తమ మీద జరుగుతున్న సమస్త పీడనలను తొలగించుకోవడానికి దోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మహిళలు సగభాగం కావాలి. అప్పుడే మహిళలు నిజమైన సాధికారత, స్వేచ్ఛలను పొందగలుగుతారు.

**- బండి శ్రామిక, 7981184205**

# పుట్టుకకు ఏది తొలిమెట్టు?



కడవేర్గు రాజశేఖర్
83093 70601

'నేడు సూర్యాస్తమయం సాయంత్రం 6.24 గంటలు' అని పత్రికలో చదివా. అయితే, సూర్యాస్తమయాన్ని కచ్చితంగా ఎలా నిర్వచిస్తారు? పడమటి కొండల్లోకి సూర్యు డు జారుకోడానికి సిద్ధమైన క్షణాన్ని సూర్యాస్తమయం అంటారా? లేక అప్పటివరకూ పూర్ణాకృతిలో కనిపించిన సూర్యబింబం సగం వరకు మాత్రమే కనిపించిన క్షణా న్ని సూర్యాస్తమయం గా పిలుస్తారా? లేక, పగలంతా కాంతిని ప్రసరింపజేసి అలసిపోయిన భానుడి వెచ్చటి ఆఖరి కిరణం భూమిని తడిమిన చివరి క్షణాన్ని సూర్యాస్తమయం అంటారా? దీనికి సరైన లెక్కలున్నాయా?

సూర్యోదయం, సూర్యాస్తమయానికి సరైన నిర్వచనం ఉన్నదో లేదో గానీ.. మనిషి దైనందిన జీవితంలో ఎదురయ్యే మంచి, చెడులకు, రాహుకాలం, వర్జ్యం, దుర్ముహూర్తం, అమృత కాలం వంటి విషయాలకు ఘడియ.. విఘడియలతో సహా సరైన సమయమే ఉంటుంది. అంతెందుకు, నెలచివర్లో బ్యాంకు ఖాతాలో జమయ్యే జీతం, పెట్రోల్ బంకుల్లో లీటర్ పెట్రోల్ కోసం చెల్లించే డబ్బు కూడా నయా పైసలతో సహా లెక్కలుంటాయి.

మనిషి చనిపోయిన సమయాన్ని కూడా సెకండ్లతో సహా మరణ ధ్రువీకరణ పత్రంలో పొందుపరుస్తారు. అయితే, మనిషి మరణాన్ని దేని ఆధారంగా ధ్రువీకరిస్తారు? ఆగిన గుండె చప్పుడును చూశా? పనిచేయకుండా స్తబ్ధుగా మారిపోయిన మెదడును చూశా? బ్రెయిన్ డెడ్ అయ్యి కోమాలోకి వెళ్లిన పేషెంట్లు ఏండ్లకేండ్లు బతుకడాన్ని చూసే ఉంటాం. గుండె ఆగిపోయిన మనుషులకు సీపీఆర్ చేసి బతికించిన కేసులు నిత్యకృత్యమయ్యాయి కూడా. అంతెందుకు? గుండె ఆగిపోయి, బ్రెయిన్ డెడ్ అయిన మనుషులు కూడా తర్వాత బతికిన కేసులు వైద్య చరిత్రలో అనేకం. అంటే, మరణాన్ని ధ్రువీకరించే సరైన సమయం ఏమిటో తేల్చుకోవాల్సి ఉంది.

ఇప్పుడు పుట్టుక విషయానికి వద్దాం: జనన ధ్రువీకరణ పత్రంలో తేదీ, సమయాన్ని సెకండ్లతో సహా రాస్తారు. అయితే, మనిషి పుట్టుకను ఎలా ధ్రువీకరించాలి? మాతృగర్భం నుంచి శిశువు తల తొలిసారిగా బయటకు కనిపించిన క్షణాన్ని జనన సమయంగా పరిగణించాలా? శిశువు పూర్తిగా బయటకు వచ్చినతర్వాత పుట్టిన సమయాన్ని లెక్కించాలా? లేదా భూమి మీద పడిన శిశువు తొలి శ్వాస తీసుకొన్న సమయాన్ని పుట్టిన సమయంగా భావించాలా? నేటి రోజుల్లో సిజేరియన్ జననాలు ఎక్కువయ్యాయి? ఈ విషయంలో జనన సమయాన్ని ఎలా తీసుకోవాలి?




ఆ పుట్టుకలోనూ మరో ప్రశ్న: నేటి జీవనశైలి, ఉరుకులు పరుగుల జీవితం, భవిష్యత్తు ప్రణాళిక వంటి కారణాలను చూపుతూ కొన్ని జంటలు సంతానాన్ని వాయిదా వేసుకోవాలనుకొంటున్నాయి. అన్నీ కుదిరాకే.. సంతానం ఆలోచనలను చేస్తున్నాయి. అయితే, ఇది మరీ ఆలస్యమైతే వయసుమీద పడి పిల్లలు కనడం ఇబ్బంది కావొచ్చు కూడా. ఈ కారణంతోనే కొన్ని జంటలు ఐవీఎఫ్ విధానంలో వీర్యకణాలను, పిండాలను సంరక్షించాలనుకొంటున్నాయి. అయితే, పురుషుడి నుంచి శుక్రకణాన్ని సేకరించడం, మహిళ నుంచి అండాన్ని తీసుకోవడాన్ని పుట్టుకగా భావించాలా? రెండు ఫలదీకరణం జరిగాక ఆ సమయాన్ని పుట్టుకగా అనుకోవాలా? లేక పిండం ఏర్పడ్డాక పుట్టుకగా భావించాలా? అనే మరో ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. ఏదిఏమైనా ఒక్క 2019లోనే ఐవీఎఫ్ పద్ధతిలో 80 లక్షల మంది శిశువులు పుట్టారని నివేదికల సారాంశం.

> పుడితేనే కదా.. బతుకు ఉండేది!: కొన్ని క్లిష్టమైన డెలివరీలు జరిగే సమయంలో 'బిడ్డ బతికే ఉందా'? అనే ప్రశ్న తరుచూ వినే ఉంటాం. పుట్టిన తర్వాతే కదా.. మనిషి బతికి ఉన్నాడా? లేదా? అనే ప్రశ్న తలెత్తేది! అంటే తల్లి గర్భంలో నుంచి శిశువు బయటకు వచ్చేకంటే ముందే మనిషి పుట్టుక మొదలైనట్టు భావించాలి.


భూమిపైన పడ్డ తర్వాతనే శిశువు పుట్టుక ప్రారంభమైనట్టు భావిస్తే, అమ్మ కడుపులో ఉన్న తొమ్మిది మాసాలు శిశువు బతికిలేనట్టేనా?? ఇదే విషయమై, అమెరికాలోని అలబామా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ టామ్ పార్కర్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. పురుషుడి శుక్రకణాలు, మహిళ అండంతో కలిసి ఫలదీకరణం చెంది పిండంగా మారినట్లైతే, శిశువు పుట్టుక మొదలైనట్లేనని జడ్జి పేర్కొన్నారు. విట్రో ఫర్టిలైజేషన్ (ఐవీఎఫ్)లో భాగంగా ఘనీభవింపజేసిన పిండం గానీ, లేక గర్భస్థ పిండాన్ని గానీ నాశనం చేయడం హత్యతో సమానమేనని, పిండాన్ని రక్షించడం రాజ్యాంగపరమైన హక్కు అని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

*('మిడ్-డే'లో రచయిత సీవై గోపీనాథ్ రాసిన వ్యాసానికి స్వేచ్ఛానువాదం)*




## రెండు నాల్కల ధోరణి ఎందుకు?

ఎన్నికల బాండ్ల డేటాను అడిగినప్పుడు ఎస్‌బీఐ సుప్రీం కోర్టు ముందు నీరసపడినట్టు ప్రవర్తిస్తుంది. అదే కేంద్రం అడిగితే చురుగ్గా స్పందిస్తుంది. రాజకీయ పార్టీలకు రహస్యంగా విరాళాలు ఇచ్చినవారి పేర్లను వెల్లడించమని కోర్టు అడిగితే అది చాలా శ్రమతో కూడిన పని ఎస్‌బీఐ అంటుంది. కానీ కేంద్రం పట్ల మాత్రం ఎనలేని ఉత్సాహం, విధేయత చూపుతుంది.



- **ప్రశాంత్ భూషణ్,** ప్రఖ్యాత న్యాయవాది